మంగళవారమే 'స్పందన'

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 17వతేదీ మంగళవారం నాడు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బసంత్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పండుగ సెలవుల దృష్ట్యా స్పందన కార్యక్రమం సోమవారం జరగనుందన, మంగళవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో జరుగుతుందన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్ స్పందన హాలు నందు ఉదయం 9.30 గంటల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు చెప్పారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందన రద్దు

ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని పండుగ సెలవుల నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గుర్తించి సోమవారం నాడు ఎస్పీ కార్యాలయం వద్దకు రావొద్దని తెలియజేశారు.



వీడని ప్లాస్టిక్..!

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా దాని వినియోగం మాత్రం తగ్గడం లేదు. 50 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీనిని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగకాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. రోగాలు పెంచుతున్నాయి. ప్లాస్టిక్‌ను భూమిలో వేస్తే నేల కలుషితమవుతోంది. కాలిస్తే విషవాయువులు వాతావరణంలో కలిసి పర్యావరణం దెబ్బతింటోంది. జీవ మనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్ నిషేధంలో నగర, పురపాలక సంస్థలు వైఫల్యం చెందాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

- విచ్చలవిడిగా వినియోగం
- ప్రమాదంలో ప్రజారోగ్యం..!
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం
- నిషేధం అమల్లో ఉన్నా, చోద్యం చూస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం కార్పోరేషన్‌తో పాటు హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంది. ఈ పట్టణాల్లో దాదాపు 10.45 లక్షల జనాభా ఉంది. రోజూ 422 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఈ చెత్తలో సుమారుగా 68 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయని అధికారులే తెలిపారు. అంటే నెలకు 1,845 టన్నులు, ఏడాదికి సరాసరి 22 వేల టన్నులకు పైగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గ్రామాల్లో వినియోగం సరేసరి. సుప్రీంకోర్టు తీర్పుమేరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగిస్తే పురపాలక శాఖ అధికారులు దాడులు చేసి జరినామా వేయవచ్చు. రూ.500 నుంచి రూ.5 వేలకుపైగా అపరాధ రుసుం విధించవచ్చని అధికారులే చెబుతున్నారు. అయినా దాడులు నామమాత్రంగానే జరుగుతున్నాయి.

ఇటీవల హిందూపురంలోని ఓ ట్రాన్స్‌పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్‌కవర్ల సంచులు

సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యమే

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని పురపాలక సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సచివాయాల్లో పర్యావరణానికి ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమించినప్పటికీ ప్లాస్టిక్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు కావాడం లేదు. అక్కడక్కడ పురపాలక సంఘాల్లో సచివాలయ పర్యావరణ కార్యదర్శులు బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించి, ప్లాస్టిక్‌ను పట్టుకున్నప్పటికీ వారికి విధించే జరిమానాలు తక్కువ ఉండడంతో వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించడం లేదు. నిషేధాన్ని కఠినంగా అమలు చేయడంలో పర్యావరణ కార్యదర్శులు నిర్లక్ష్యం విడిచి దాడులు నిర్వహిస్తే తప్పా పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు కాని పరిస్థితి కన్పిస్తోంది.

ఎక్కడపడితే అక్కడ ప్లాసిక్...

ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారు. మురుగు కాల్వల్లో వేయడం వల్ల కాలువలకు అడ్డంపడి మురుగు రోడ్లపైకి చేరుతోంది. కల్వర్టులకు అడ్డంగా చేరి వర్షం వస్తే రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. దుకాణదారులు డ్రెయినేజీలపై బండలు వేయడంతో వాటి కింద ప్లాస్టిక్ ఇరుక్కుపోయి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ వినియోగం నిషేధం ఉన్నా.. అమలు చేయడంలో పురపాలక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం పెరుగుతుందని పలు అధ్యయనాలు నిగ్గుతేల్చాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోని ఆహార పదార్థాలు తినడం వల్ల ప్రమాదకరమైన 'కార్సినోజన్లు' శరీరంలో చేరి క్యాన్సర్‌కు దారితీస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇంతటి నష్టాన్ని చేకూర్చే ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేలా ప్రజల్లో అధికారులు చైతన్యం తీసుకురావాల్సి ఉందని పలువురు సూచిస్తున్నారు.

విస్తృత దాడులు చేస్తాం

50 మైక్రాన్లకన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఎక్కడైనా వినియోగిస్తే విస్తత దాడులు చేసి చట్టపరమైన చర్యలతో పాటు భారీ జరిమానా విధిస్తాం. కరోనా వల్ల కొంత దాడులు తగ్గినమాట వాస్తవమే. త్వరలో ప్లాస్టిక్ నిషేధం అమలుపై ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తాం.

డాక్టర్ వెంకటేశ్వరరావు,
మున్సిపల్ కమిషనర్, హిందూపురం

పండుగ వేళ రాజకీయ సందడి..!

- కనుమపైనే మక్కువ
- పెద్దఎత్తున జాతరలకు సిద్ధం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ధాన్యం ఇంటికి చేరిన వేళ జరుపుకునే సంక్రాంతి పండుగలో రాజకీయ సందడే ఎక్కువగా కన్పిస్తోంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామీణ పండుగ అయిన సంక్రాంతి సమయంలో నేతలు గ్రామాల్లో సందడికి సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున గ్రామీణ క్రీడలను నిర్వహిస్తున్నారు. ఇక కనుమ రోజున ఆయా ప్రాంతాల్లో ప్రజలతో కలిసి పండుగ జరుపుకునేందుకు నాయకులు సిద్ధమ్యారు. కోస్తా ప్రాంతంలో లాగా ఇక్కడ కోడి పందేళ్లు అడటం తక్కువగానే ఉంటాయి. ఉన్నా అరకొరగా ఇళ్ల మధ్యలోనే వీటిని ఆడుతుంటారు. కనుమ పండుగ రోజు మాత్రం యాటలు (మేక, పొట్టెలు) కొట్టి పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా ఉంది. శనివారం భోగి పండుగ రోజే స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష చరణ్ శ్రీ బోగి మంటలు నిర్వహించడమే కాకుండా నియోజకవర్గం పరిధిలోని కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామం పరిధిలో పర్యటించారు. ఎద్దుల బండిపై వెళ్లి చౌడేశ్వరి దేవాయలంలో పూజలు నిర్వహించారు. నవరత్నాలతో సామాన్య జీవితాల్లో సంక్రాంతి తెచ్చామని చెప్పారు. అనంతపురం నియోజకవర్గం పరిధిలోని నారాయణపురంలో గ్రామీణ క్రీడలను స్థానిక వైసిపి నాయకులు నిర్వహించగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయరు వసీం ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామంలో శనివారం జరిగిన జాతరకు ఎద్దుల బండిపై వస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కనుమ రోజు జాతరలు

సంక్రాంతి పండుగ అయిపోయిన మరుసటి రోజు సోమ, మంగళవారాల్లో పెద్దఎత్తున కనుమ పండుగ జరుపుకునేందుకు నేతలు ఏర్పాట్లు చేసుకోవడం గమనార్హం. రాప్తాడు నియోజకవర్గం పరిధిలో తోపుదుర్తి కనగానపల్లి మండలంలో మద్దెలచెరువు, తాడిపత్రి ప్రాంతంలో సింగనగుట్టపల్లి ఇలా అనేక ఊళ్లలో కనుమ పండుగను పెద్దఎత్తున నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వందల యాటలను కొట్టేందుకు ఏర్పాట్లు జరగడమేకాకుండా దీనికి అందరినీ కలిపేందుకుగానూ ఆహ్వానాలను ఇప్పటికే పంపారు. కనేకల్ మండలంలోనూ జాతర విషయంలో దున్నపోతు కోసం రెండు గ్రామాల మధ్య వివాదం సైతం నడుస్తోంది.

సామాన్యుల్లో కనిపించని ఉత్సాహం

రాజకీయంగా పండుగ సందడి కనిపిస్తున్నా... సామాన్యుల ఇళ్లలో అటువంటి హడావుడి సందడి కనిపించలేదనే చెప్పాలి. గత ఖరీఫ్‌లో మంచి వర్షాలు పడినప్పటికీ పంటల దిగుబడులు ఆశించినంత రైతులకు దక్కలేదు. దీంతో డబ్బుల్లేక పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో మొక్కుబడిగానే పండుగ జరుపుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఆ సందడి కనిపించడం లేదు. పెరిగిన ఆర్థిక సంక్షోభం ప్రభావంతో ఆదాయాలు తగ్గిపోయాయి. ఆదాయాలు పడిపోయాయి. దీంతో కొత్త బట్టలు, నిత్యావసరాలు కొనేవారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయని వ్యాపారాలు వాపోతున్నారు.

చలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోండి

చిన్నపిల్లల వైద్యులు ఆఫ్తాబ్

ప్రజాశక్తి-హిందూపురం

కొంతకాలంగా హిందూపురంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా చలి ఉండటంతో జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ అసుపత్రి చిన్నపిల్లల వైద్యులు ఆఫ్తాబ్ సూచించారు. శనివారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గతేడాది వర్షాలు బాగా కురిసినందున వాతావరణంలో అనుకోని మార్పులు వచ్చాయన్నారు. ముఖ్యంగా గాలిలో తేమశాతం ఎక్కువగా ఉందన్నారు. ఉదయం మంచు ప్రభావం ఎక్కువగా ఉన్నందున చిన్నపిల్లలు, వృద్ధులు బయట ఎక్కువగా ఉండకుండా ఇంట్లోనే ఉండటం మంచిదన్నారు. బయటకు వెళ్లేటప్పుడు చెవులు, ముక్కును కవర్ చేసేటట్టు గుడ్డను ముఖానికి చుట్టుకోవాలన్నారు. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. బయటకు వెళ్లి ఇంటికి వచ్చేటప్పుడు పెద్దలు సోపుతో, డెటాల్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు గవర్నమెంట్ ఆసుపత్రి వారు నిర్దేశించిన ప్రకారం వాక్సినేషన్ వేసుకోవాలన్నారు. జ్వరం, దగ్గు ఉంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి, డాక్టర్‌ను సంప్రదించి, రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి ఒకసారి బ్లీచింగ్ చల్లాలని చెప్పారు. రాత్రి నిద్ర పోయేటప్పుడు వీలైతే దోమ తెర వాడాలని, టీబీ పేషెంట్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.17 లక్షల విలువైన సొత్తు స్వాధీనం : డీఎస్పీ హుస్సేన్‌పీరా

ప్రజాశక్తి-పెనుకొండ

చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా తెలిపారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలో నలుగురిని అరెస్టు చేసి బంగారు, వెండి ఆభరణాలతో పాటు ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వాటి విలువ దాదాపు 17 లక్షల ఉంటుందని తెలిపారు. నిందితులు దాదాపు 29 దొంగతనం కేసుల్లో 320గ్రాములు బంగారం, 630 గ్రాములు వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలోని మడకశిర, పెనుకొండ, రొద్దం తదితర మండలాల్లోని గ్రామాల్లో తాళాలు వేసిన ఇళ్లలో, పలు ఆలయాల్లో దొంగతనాలు చేసినట్లు గుర్తించామన్నారు. ఈ ముఠాకు సంబంధించి నలుగురిని అరెస్టు చేశామని,మరో ఇద్దరు ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితులు కర్ణాటక రాష్ట్రం పావుగడ తాలూకాకు చెందిన బొమ్మలాట ఆంజనేయులు, నరేష్, రాఘవయ్య, శేషగిరిరావు, వీరంతా కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారన్నారు. వీరిలో ఆంజనేయులు, నరేష్ అన్నదమ్ములన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ నిందితులను పట్టుకోవడంలో ప్రముఖ పాత్ర వహించినటువంటి సీఐ కరుణాకర్ ధర్మవరం ట్రాఫిక్, సిసిఎస్ ఇన్‌ఛార్జి సిఐ వహీద్‌బాషా, కియా ఎస్పై వెంకటరమణ, రొద్దం ఎస్ఐ నాగస్వామి, సిబ్బంది మారుతి, ఆదినారాయణ, నాగరాజు, దస్తగిరి, రామకృష్ణ, పవన్‌ను అభినందించినట్లు తెలిపారు. అంతేగాకుండా వీరికి రివార్డులు ఇవ్వడానికి ఎస్పీకి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సీఐ వహీద్‌బాషా, పెనుకొండ సీఐ కరుణాకర్, మడకశిర సీఐ సురేష్‌బాబు, ఎస్ఐలు రమేష్‌బాబు, నాగస్వామి, వెంకటరమణ, నాగేంద్ర, నాగేంద్ర, దస్తగిరి, రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

కదిరిలో వీరసింహారెడ్డి డైరెక్టర్

కదిరి టౌన్ : నందమూరి బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి డైరెక్టర్ గోపీచంద్ శనివారం పట్టణంలోని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సినిమా విజయం సాధించడంతో డైరెక్టర్ గోపీచంద్ కదిరికి విచ్చేసి అభిమనులతో కలిసి రాధిక థియేటర్‌లో సినిమాను వీక్షించారు. అనంతరం అభిమానులతో కలిసి కేక్ కోసం సంబరాలు జరుపుకున్నారు. ముందుగా పట్టణంలోని శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు

కందికుంటతో కరచాలనం చేస్తున్న గోపీచంద్

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గెలుపొందిన సత్యసాయి జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు విజయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నంద్యాలలో హాకీ జరుగుతున్న 13వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హాకీ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించినట్లు హాకీ కోచ్ హస్సేన్ తెలిపారు. శనివారం ఉదయం జరిగిన లీగ్ మ్యాచ్లో విజయనగరంజిల్లా జట్టుపై 3-0 గోల్స్ తేడాతో సత్యసాయి జిల్లా జట్టు విజయం సాదించగా మద్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఎన్టీఆర్ జిల్లాజట్టుపై 6-0గోలేడాతో . సత్యసాయి జిల్లాజట్టు విజయం సాదించినట్లు కోచ్ తెలిపారు. దీంతో హాకీ క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రసిడెంట్ బంధనాథం సూర్యప్రకాష్, సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

నీలకంఠేశ్వర స్వామిని దర్శించుకున్న కలెక్టర్ బసంత్‌కుమార్ దంపతులు

నీలకంఠేశ్వరున్ని దర్శించుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని నీలకంఠాపురంలో వెలసిన నీలకంఠేశ్వర స్వామిని కలెక్టర్ బసంత్‌కుమార్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీమంత్రి రఘువీరారెడ్డి దంపతులు కలెక్టర్ దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రఘువీరా దంపతులు ముందుండి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడం సంతోషకరమన్నారు. సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా తాను భాధ్యతలు చేపట్టినప్పటి నుండి శ్రీ నీలకంఠేశ్వరుడిని దర్శించుకోవాలని అనుకున్నప్పటికీ కుదరలేదన్నారు. భోగి పండుగ సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి నీలకంఠాపురం వచ్చినట్లు తెలిపారు. అలాగే జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట తహాశీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయాన్ని కలెక్టర్ బసంత్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు, కమిటీ ఛైర్మన్ మంజునాథ్ పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మంజున్నాథ్ కలెక్టర్‌కు పూలమాలలు వేసి సత్కరించారు ఈకార్యక్రమంలో సర్పంచి తిప్పేస్వామి, పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పురం ఇన్‌ఛార్జి డీఎస్పీ యశ్వంత్

ప్రజాశక్తి-హిందూపురం

రాజకీయాలు ఏమైనా ఉంటే వాటిని ఆ మేరకే చూసుకోవాలని, దానిని అడ్డం పెట్టుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హిందూపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ యశ్వంత్ అధికార పార్టీ కౌన్సిలర్లను హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం అధికార పార్టీ కౌన్సిలర్లు మధ్య బాహాబాహాకి జరిగిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లు ఇర్షాద్, రోషన్ అలీలను శనివారం నాడు పోలీసు స్టేషన్‌కు రమ్మని పిలిపించారు. ఈ సమయంలో కౌన్సిలర్ శివ తరపున ఇతర కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఒక్కొక్కరిని రమ్మని పిలిస్తే, ఇంత మంది ఎలా వస్తారని డీఎస్పీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్ వద్దకు వచ్చిన నాయకులందరినీ పోలీసులు బయటకు పంపించారు. కౌన్సిలర్లందరినీ డీఎస్పీ లోపలికి పిలిపించి వారితో సుధీర్ఘంగా చర్చించారు. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించలేదు. నాయకులు రోడ్ల మీద వివాదాలకు దిగవద్దని వారికి డీఎస్పీ సూచించినట్లు సమాచారం. తాము ఎలాంటి తప్పిదాలు, అసాంఘిక కార్యకలాపాలు చేయడం లేదని, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తున్నామని కౌన్సిలర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్థల వివాదానికి కారకులైన కౌన్సిలర్లు రోషన్ అలీ, ఇర్షాద్‌లతో డీఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని వారికి సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్టేషన్ బయట గుమికూడిన వైసిపి నాయకులు

జీవో-1ను వెంటనే ఉపసంహరించుకోవాలి

భోగి మంటల్లో ప్రతులు వేసి నిరసన

హిందూపురంలో సిఎం దిష్టిబొమ్మను భోగి మంటల్లో దహనం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఒక్క అవకాశం పేరుతో గద్దెనెక్కిన జగన్ రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్నారని టిడిపి పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ విమర్శించారు. ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-1ను నిరసిస్తూ శనివారం పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో ఉన్న బాలకృష్ణ నివాసం ముందు టిడిపి ఆధ్వర్యంలో భోగిమంటల్లో జీవో ప్రతులను వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్, టిడిపి నాయకులు అంజినప్ప, అమర్నాథ్, పరిమళ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలను అణచివేసేందుకే సిఎం జగన్ ఇలాంటి జీవోలను తీసుకొచ్చారన్నారు. వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటరమణ, నెట్టప్ప, భాస్కర్, సుమో సీనా, నబీరసూల్, ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్ రాఘవేంద్ర, బిసి అధ్యక్షులు దుర్గానవీన్, నాయకులు మంగేష్, మోదా శివకుమార్, దేశాయ్ మురళి, వెంకటేష్, సునీల్, అశోక్, రవీంద్రనాయుడు, ఆంజనేయులు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హిందూపురం రూరల్ మండలం తూమకుంట చెక్‌పోస్టు వద్ద అన్నదానం చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకుడు నరసింహప్ప పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈకార్యక్రమంలో మండల క్లస్టర్ కన్వీనర్ ప్రదీప్, జిల్లా పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఆదినారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి టీజీ నాగరాజు, మాజీ డీలర్ ముద్దుకృష్ణ, మాజీ ఎంపీటీసీ నంజుండప్ప, గ్రామ కమిటీ అధ్యక్షులు సంజీవరాయప్ప, కృష్ణారెడ్డి, కారుడిపల్లి శ్రీనివాసులు, ఎ.బాలకృష్ణ, రవిచంద్ర, నరసింహులు, సంజీవప్ప, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : ఒక్క అవకాశం పేరుతో గద్దెనెక్కి రాక్షస పరిపాలన అందిస్తున్న సిఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. ఈమేరకు ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో -1 ను నిరసిస్తూ శనివారం పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న టిడిపి కార్యాలయం ముందు వేసిన భోగి మంటల్లో జీవో ప్రతులను వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలను అణచివేయాలనే ఉద్దేశంతోనే వైసిపి ప్రభుత్వం జీవోను తీసుకొచ్చిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సిఎం జగన్‌ను ఇంటికి పంపి చంద్రబాబును సిఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, తెలుగు యువత నాయకులు తిమ్మరాజు, రవి, వైస్‌ఛైర్మన్ నాగరాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 1 ప్రతులను శనివారం తెల్లవారుజామున టిడిపి కార్యాలయం ముందు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షాల గొంతు నొక్కి చీకటి జీవోను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. అలాగే ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు సామకోటి ఆదినారాయణ, చిమిరాల సుధాకర్, ఉమాపతి, ఈశ్వర్ రెడ్డి, తెలుగు యువత నాయకులు జయప్రకాష్, అంబులెన్స్ రమేష్, గంగాధర్, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : ఇటీవల వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1ను వెంటనే ఉపసంహరించుకోవాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం ముందు జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో జగన్ ప్రజా కంతక జీవోలు తీసుకురావడం బాధాకరమన్నారు. పాలన ఎలా తెలియని జగన్ ఇలాంటి జీవోలను తీసుకొచ్చి ప్రజలను ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపి చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అత్యవసరం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, నాయకులు హరీష్, రొద్దకంపల్లి నాగరాజు, మురళి, చంద్రశేఖర్, రుద్ర, తదితరులు పాల్కొన్నారు.

గోరంట్ల : ఇటీవల వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 1 పత్రాలను టిడిపి నాయకులు శనివారం ఉదయం పట్టణంలోని బస్టాండ్ వద్ద వేసిన భోగి మంటల్లో దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకురావడం బాధాకరమన్నారు. త్వరలో తమ యువనేత నారా లోకేష్ చేపట్టనున్న పాదయాత్రను అడ్డుకునేందుకు వైసిపి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. వెంటనే జీవోను రద్దు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, హిందూపురం పార్లమెంటు కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, జిల్లా కార్యదర్శి వేణు, జిల్లా ఉపాధ్యక్షులు జయరాం, నరేంద్రరాయల్, నీలకంఠారెడ్డి, అజ్మతుల్లా, ఫిరోజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కదిరిటౌన్ : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట ఆదేశాల మేరకు టిడిపి నాయకులు శనివారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో - 1 ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతుకుముందు సైకో పోవాలి, సైకో జగన్, మూడు రాజధానులు ముఖ్యమంత్రి, అప్పులపాలైన ఆంధ్రప్రదేశ్ అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ టవర్‌క్లాక్ వరకూ ప్రదర్శనగా వచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఇర్ఫాన్, హిందూపూర్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు హరి, నాగరాజు, మందాల గోపాల్, మహిళా నాయకురాలు రమణమ్మ, ఆయేషా, ప్రకాష్, నాగరాజు, మనోహర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో జీవో-1 ప్రతులను దగ్ధం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి నాయకులు

నల్లచెరువు : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో టిడిపి నాయకులు ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-1ను ప్రతులను భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ చీకటి జీవోలతో అరాచక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సభలు, సమావేశాలు, ర్యాలీలు చేయకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే జీవో-1ను తీసుకొచ్చారన్నారు. వెంటనే జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు అంజనప్ప, లక్ష్మీపతి నాయుడు, గుత్తా ప్రసాద్, తిరుపాలు, కె.ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే జీవో -1ను తీసుకొచ్చిందని టిడిపి నాయకులు విమర్శించారు. జీవోను నిరసిస్తూ మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని కెత్తచెరువు అమ్మ ఆలయం వద్ద జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఉద్యమాలు చేయకుండా వైసిపి ప్రభుత్వం ఇలాంటి జీవోలను తీసుకొచ్చిందన్నారు. వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పవన్, వలిపి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పెద్దన్న, నల్లమాడ, శంకర్, వెంకటేశు, మాధవి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిమ్మమాంబ బంధుగణ బలిజ సేవా సమితి నాయకులు

తిమ్మమ్మ మర్రిమానును పరిరక్షించుకుందాం..

తిమ్మమాంబ బంధుగణ బలిజ సేవా సమితి సభ్యులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

తిమ్మమ్మ మర్రిమానును పరిరక్షించుకుందామని తిమ్మమాంబ బందు గణ బలిజ సేవా సమితి సభ్యులు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని గూటిబైలు గ్రామంలో వెలసిన తిమ్మమ్మ మర్రిమాను వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచిన తిమ్మమ్మ మర్రిమాను ఇక్కడ వెలవడం గర్వకారణమన్నారు. అంతేగాకుండా గిన్నీస్ బుక్ రికార్డులో పేరు సంపాదించడం మరింత సంతోషకరమన్నారు. అయితే ఇలాంటి మహావక్షం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీనికితోడు కొంతమంతి రాజకీయ నాయకులు అడ్డుకోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అందరం ఒకతాటిపైకి వచ్చి కలిసిమెలిసి తిమ్మమ్మ మర్రిమానును అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు గిరిధర్ రాయల్, శివరామ్‌ప్రసాద్, భైరప్రసాద్, సందీప్, కళ్యాణ్‌కుమార్, శ్రీసాయి, లోకేష్, రెడ్డి శేఖర్‌రాయల్, సర్పంచి విష్ణుమూర్తి, శివశంకర్, శుభసంకల్పన, బలిజ సేవా సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

నిరుపేదలకు గ్యాస్ పంపిణీ

కొత్తచెరువు : మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్డు సమీపంలో గుడారాల్లో నివసిస్తున్న నిరుపేదలకు పిఆర్‌డిఎస్ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన సత్యసాయి భక్తులు న్యూసీన్ యాంగిల్ జో శనివారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడారాల్లో నిరుపేదలు వంట చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నందున గ్యాస్ పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నారులకు గాలిపటాలు, ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డిఎస్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, పద్మావతి, వెంకటరాముడు, చెన్నరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు గ్యాస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఘనంగా భోగి వేడుకలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారు జాము వరకూ వాడవాడలా, వీధివీధిలో, ప్రతి ఇంటి ముంగిట భోగి మంటలు వేశారు. వయోభేదం లేకుండా, చలిని లెక్కచేయకుండా భోగి మంటల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కాగా బత్తలపల్లి శివాలయం వద్ద శివదీక్షపరులు భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. భోగి పళ్లను చిన్నారులపై పోసి దిష్టితీశారు.

ధర్మవరం టౌన్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా శనివారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజామున మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పెనుజూరు నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున భోగి మంటలు వేసి పూజలు చేశారు. ఉదయం ప్రతి ఇంటిలో భోగిస్నానాలు చేసి ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గులను వేశారు. కాగా ప్రజలు అనపకాయ, గుమ్మడికాయ, చెరుకుగడ్డ, రేణుకాయ, పూలు నెత్తిన పెట్టుకుని తెల్లవారుజామునే భోగిస్నానం చేశారు.

ధర్మవరంలో భోగిమంటలు వేసుకుంటున్న దృశ్యం

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా భోగి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజామున తమ ఇళ్ల ముందు భోగిమంటలు వేసి పూజలు చేశారు. తర్వాత ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, అందులో గొబ్బెమ్మలు పెట్టి, నవధాన్యాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

రికార్డుల మేరకే రోడ్డు ఏర్పాటు

వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి-పెనుకొండ

తాము కొనుగోలు చేసిన ప్రయివేట్ భూమిలో రికార్డుల మేరకే రోడ్డును ఏర్పాటు చేశామని వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద సర్వేనెంబర్ 681లో 15.50సెంట్లు భూమిని ముగ్గురం కలిసి కొనుగోలు చేశామన్నారు. అయితే కొంతమంది రాజకీయ దురుద్దేశంతో తమ అధికార పార్టీకి చెందిన వారే ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బంది కలిగించమన్నారు. గతంలో ఈ భూమిని పట్టణానికి చెందిన వైశ్యుల నుండి శివారెడ్డి కొనుగోలు చేశారని, తిరిగి స్థలాన్ని శివారెడ్డి ముగ్గురు వైశ్యులకు అమ్మారన్నారు. వారి నుంచి తనతోపాటు రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కలిసి కొనుగోలు చేశామన్నారు. విలేజ్ మ్యాప్ మేరకు రస్తాను ఏర్పాటు చేశామని వివరించారు.

ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని త్యాగరాజనగర్‌లో వెలసిన ఉమా నర్మదేశ్వర శివాలయం అభివృద్ధి కోసం వైసిపి మాజీ సమన్వయ కొండూరు వేణుగోపాల్‌రెడ్డి శనివారం రూ.50116 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఆలయాల్లో ఎక్కడా లేనివిధంగా రాతి నిర్మాణం, అద్భుతమైన నిర్మాణం ఉందన్నారు. కావున ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోవిందరెడ్డి, ప్రదీప్, జగదీష్, సాయిచరణ్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నిర్వాహకులకు నగదును అందిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కన్నుల పండువగా గోదాదేవి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధనుర్మాసం బోగి సందర్భంగా శనివారం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు ముందుగా గోపూజ చేశారు. అనంతరం చెన్నకేశవున్ని వివిధ రకాల పూలు, పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత అర్చకులు మకరంద బాబు, కోనేరాచార్యులు, భానుప్రకాష్ వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సం నిర్వహించారు. మహామంగహారతి, తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నమయ్య సేవా మండలి సభ్యులు పాతాళపుల్లయ్య బృందం అన్నమయ్య సంకీర్తనలను గావించారు.

సమయం లేదు మిత్రమా!

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

సమయం లేదు మిత్రమా' అన్నట్టుగా ఉంది. అధికారపార్టీ నేతల తీరు. సార్వత్రిక ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయముంది. ఇప్పటికే మూడున్నరేళ్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది ఆఖరు వచ్చిందంటే ఎన్నికలు సమీపిస్తాయి. అప్పుడు ఏదైనా తప్పు చేస్తే ఎన్నికలపై ప్రభావం పడుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడే సాధ్యమైనంత వెనకేసుకునే పనులను అధికారపార్టీ నేతలు చేపట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అంటే కాంట్రాక్టు పనుల ద్వారా సంపాదిస్తామంటే నిధుల్లేక పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఇక పర్సంటేజీలు అనుకున్నంత అందుకునే పరిస్థితి లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భూములు, మైనింగుపై అధికారపార్టీ నేతల కన్ను పడింది. రియల్ బూమ్‌తో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. వీటిని ఏదో రకంగా కైవసం చేసుకుంటే కోట్ల సంపదను సులభంగా పోగేసుకోవచ్చునన్న ఉద్ధేశ్యంతో అధికారపార్టీ నేతలు వీటిపై దృష్టి సారించారన్న ఆరోపణలున్నాయి. కంపెనీల పేరుతో తీసుకున్న భూములను తమ పేర్లపైకి మారిపోతూ ఉండటం గమనార్హం. నేరుగా భూములు కొనాలంటే జిల్లాలో అత్యధికంగావున్నవి అసైన్డు భూములు. వీటి రిజిస్ట్రేషన్లు, సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి. అదే పరిశ్రమల పేరుతో అయితే సేకరించడానికి వీలుంటుంది. ఆ పేరుతో సేకరించిన భూములను తాము ఏర్పాటు చేసుకున్న కంపెనీల పేర్లపైకి మార్చేసి వందల ఎకరాల భూములను తమ వశం చేసుకునే పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే నలుగురు ప్రజాప్రతినిధులపై నేరుగానే ఆరోపణలొచ్చాయి. ఇక అసైన్డు కమిటీల ఏర్పాటు చేసి పేదలకు భూములు పంచుతామని ప్రచారమూ జరుగుతోంది. దీంతో ఇప్పటికే జిల్లాలో పెద్దఎత్తున కొండ,గుట్టలన్నీ చదునై పోయాయి. వందల ఎకరాల భూములు అసైన్డు కమిటీలో ఇచ్చేందుకు సిద్ధమై ఉన్నాయి. ఇదంతా అధికారపార్టీ నేతల కను సన్నల్లోనే సాగుతోంది. అప్పుడే ధరలు సైతం నిర్ణయించబడుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక మైనింగు విషయానికి వస్తే ఇసుక, మట్టి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ఇటీవల వర్షాలు అధికంగా పడటంతో వాగులు, నదుల్లోకి సైతం ఇసుక వచ్చిచేరింది. దీంతో ఉన్న ఇసుకను ఎటువంటి అనుమతుల్లేకుండానే యధేచ్ఛగా విక్రయాలను అధికారపార్టీ నేతలు చేపడుతున్నారు. ఉదాహరణకు పెద్దపప్పూరు మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయం ఎదుటే అనుమతుల్లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులు మిన్నకుండటం మినహా చేయగలిగిందేమి ఉండటం లేదు. మట్టి తవ్వకాలు జిల్లా వ్యాప్తంగా అధికారపార్టీ నేతల అండతో సాగుతూనే ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లోపు సాధ్యమైనంత వెనకేసుకునే పనిలో భాగంగానే ఇవి జరుగుతున్నాయన్న ఆరోపణలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సాగు చేసుకుంటున్న పేదలకు అసలైన సాగుదారులక పట్టాలివ్వాలని సిపిఎం పోరాటాన్ని చేపట్టింది. అదే విధంగా నివాసముంటున్న వారికి ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తోంది. అనంతపురం జిల్లా పరిధిలో అన్ని ఆర్డీఒ కార్యాలయాల ఎదుట ధర్నాలను సైతం నిర్వహించారు. అధికారులకు లబ్ధిదారుల వివరాలను సిపిఎం ఈ వారంలో అందజేసింది. అయితే అసలైన లబ్ధిదారులకు మాత్రం అసలైన లబ్ధి చేకూరడం లేదు. అధికారపార్టీ నేతల పేరు మీద మాత్రం పెద్దఎత్తున భూములు మారిపోతుండం గమనార్హం.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతిచెందిన వేణు

రొద్దం : మండలంలోని పెనుకొండ-పావగడ రహదారిలో ఉన్న బొక్కసంపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎగువపల్లి గ్రామానికి చెందిన వేణు (40) మృతిచెందారు. ఆయన భార్య భార్గవి, అశ్వర్థప్పకు తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలపారు. వారు తెలిపిన వివరాల మేరకు... త్వరలో బంధవుల పెళ్లి ఉండటంతో దుస్తులు కొనేందుకు శుక్రవారం బెంగళూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పెనుగొండ గాట్ రోడ్డులో రాత్రి 11.30 సమయంలో వేగా నిరోధకాలు వద్ద అదుపు తప్పి సమీపంలోని చెట్టును ఢీకొన్నాడు. దీంతో డ్రైవర్ వేణు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్గవి, అశ్వర్థప్పకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలపారు.

మైలేపల్లి వద్ద యువకుడు...

కొత్తచెరువు : మండల పరిధిలోని మైలేపల్లె గ్రామ సమీపంలో ఉన్న బిఇడి కళాశాల వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాల మేరకు.. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి గ్రామానికి చెందిన నాగార్జున (23) వినోద్ కలిసి ద్విచక్ర వాహనంలో కొత్తచెరువులో సినిమా చూసేందుకు వెళ్లి తిరిగి రాత్రి స్వగ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. గమణించిన స్థానికులు 108 ద్వారా పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నాగార్జున మృతిచెందాడు. వినోద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం

డ్రైవర్‌కు తీవ్రగాయాలు

బత్తలపల్లి : పశువులకు పశుగ్రాసం తీసుకెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం నుంచి తప్పించుకునే ప్రయత్నంలో డ్రైవర్ తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... బత్తలపల్లికి చెందిన రమేష్ మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలో రూ.12వేలకు గడ్డిని కొనుకోలు చేశారు. దీంతో బత్తలపల్లికి ట్రాక్టర్‌లో గడ్డిని తీసుకెళ్తుండగా బత్తలపల్లి సచివాలయం వద్దకు రాగానే కింద వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి గడ్డి అంటుకుంది. వెంటనే డ్రైవర్ పోతలయ్య ట్రాక్టర్‌ను ముందుకు తీసుకువెళ్లి పైకి ఎక్కి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు దట్టంగా వ్యాపించడంతో కిందకు దూకేశాడు. దీంతో కాలు విరిగింది. గమణించిన శివదీక్షాపరులు వెంటనే క్షతగాత్రున్ని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్‌లోని గడ్డిని కిందకు వేసి, ట్రాక్టర్‌ను పక్కకు తొలగించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బత్తలపల్లి : టిడిపి నాయకులు తమ స్థలాన్ని ఆక్రమించుకున్నారని మనస్థాపం చెందిన ఓ దళిత మహిళ శనివారం వాస్మాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... బత్తలపల్లికి చెందిన సాకే వేదవతికి భర్త నుంచి సక్రమించిన 1.72 సెంట్లు ప్రభుత్వం ఇచ్చిన స్థలం ఉంది. ఈ స్థలాన్ని బత్తలపల్లికి చెందిన టిడిపి నాయకులు మీ మామ, భర్త తనకు అప్పు ఉన్నారంటూ ఆక్రమించుకున్నారన్నారు. తాము నిరుపేదలమని, అన్యాయం చేయొద్దని ఎంత వేడుకున్నా కనికరించలేదన్నారు. అంతేగాకుండా బెదిరింపులు ఎక్కువ మరింత ఎక్కువ అయ్యాయన్నారు. దీంతో భయపడిన వేదవతి స్థలం వద్దకు వెళ్లి వాస్మాయిల్ తాగి అపస్మారకస్థితిలో పడి ఉంది. గమణించిన స్థానికులు కుమారుడు శ్రీకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో అతడు వచ్చి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుత్రికి తరలించారు. పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు.

దుకాణదారులపై దాడి..

హిందూపురం : పట్టణంలోని డిఎల్ రోడ్డులో కిరాణాషాపు నిర్వహిస్తున్న ముజాయిద్, ముస్తీకింపై సేవామందిరానికి చెందిన ఫైజల్, ఫహద్ దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వెంటనే స్థానికులు క్షతగాత్రులను స్థానిక జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ విషయంపై దాడిలో గాయపడిన వారు మాట్లాడుతూ తాము నిర్వహిస్తున్న కిరాణాషాపులో సరుకులను అప్పుగా ఇవ్వాలని ఫైజల్, ఫహద్ ఒత్తిడి చేశారన్నారు. అయితే అప్పు ఇవ్వాడానికి సాధ్యం కాదని తెలపడంతో దాడి చేశారన్నారు. వీరి నుంచి పోలీసులు తమ ప్రాణాలను రక్షించాలని కోరారు. ఈమేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అన్నదానానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న గోనుగుంట్ల

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని శివాలయంలో శివ భక్తులకు అన్నదానం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల నారాయణ శనివారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన శివ భక్తులు ధర్మవరంలోని సూరి నివాసానికి వెళ్లి అన్నదానానికి విరాళం అందజేయాలని కోరగా రూ.15వేలు ఆర్థికసాయం అందజేసినట్లు భక్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీకన్వీనర్ నారాయణస్వామి, సత్యనారాయణతోపాటు శివ భక్తులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

గుడిబండ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని మైనగానపల్లి గ్రామంలో జ్ఞానరుక్ష ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వరప్రసాద్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం కోసం జన్మనిచ్చిన సొంత గ్రామం మైనగానపల్లి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ట్రస్టును ఏర్పాటు చేసి సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవృక్ష ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు వరప్రసాద్, సభ్యులు మహదేవ్, గలరప్ప, గోపాల్, మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవా కమిటీ సభ్యులకు సన్మానం

కదిరిటౌన్ : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో దాదాపు 60 రోజుపాటు మాల ధరించిన స్వాములకు అన్నదానం చేసినందుకు ఆలయ అధ్యక్షులు డాక్టర్ శంకరయ్య, కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వామి సేవాసమితి వారిని శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు డాక్టర్ శంకరయ్య మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎంతో దోహదపడుతూ, వేలాదిమంది అయ్యప్పలకు, దాతల సహకారంతో ఇబ్బందులు కలగకుండా 60 రోజులు పాటు అన్నదానాన్ని కొనసాగించామన్నారు. ఇందుకు అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



అయ్యప్పసేవా కమిటీ సభ్యులకు సన్మానం చేస్తున్న దృశ్యం